21 నుంచి ఎంబీఏ ఇంటర్నల్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ ఇంటర్నల్ పరీక్షలు 21వ తేదీ నిర్వహించాలని బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ జహంగీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రెండవ ఇంటర్నల్ పరీక్షలను 26లోగా, రోజుకు రెండుకు మించకుండా నిర్వహించాలని కళాశాలల నిర్వహకులకు సూచించారు. ఇంటర్నల్ పరీక్షలకు నూతన విధానాన్ని రూపొందించినట్లు చెప్పారు. కళాశాలల యాజమాన్యాలకు ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్, మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్ష ఫీజును ఈనెల 28వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

19న కామ్రేడ్ గౌస్ వర్ధంతి

చిక్కడపల్లి, ఏప్రిల్ 17: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్ ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యాలయంలో పల్లె మురళి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ కమ్యూనిస్టుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేసిన అఖిలభారత కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అమరత్వం పొందిన కామ్రేడ్ గౌస్ వర్ధంతి సభలను ఏప్రిల్ 19న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపేందర్‌రెడ్డి, కుమారస్వామి, సుధాకర్, మట్టయ్య, హెన్ రెడ్డి హంసారెడ్డి, రమేష్, మంద పాల్గొన్నారు.

పడగ విప్పుతున్న బెట్టింగ్ భూతం

- పందాలతో అప్పుల ఊబిలో యువత
- ఐపీఎల్ సీజన్ లో పందెం రాయుళ్ల బిజీ
- నగరంలో జోరుగా క్రికెట్ బెట్టింగ్
- యాప్‌లలో మోసపోతున్నా.. బయటకు పొక్కకుండా జాగ్రత్తలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 17: కొందరు యువత ఆటను ఆస్వాదిస్తుండగా.. మరికొందరు సొమ్ము చేసుకోవాలని ఆశపడి బోల్తా పడుతున్నారు. బెట్టింగ్‌లతో జేబులు గుల్లా చేసుకుంటున్నారు. ప్రపంచ దేశాల్లో ఏ చోట క్రికెట్ ఆడినా.. ఎలాంటి ఫార్మాట్లైనా పందెం ఆడుతూ బానిసలుగా మారుతున్నారు. బెట్టింగ్లతో జరగాల్సిన నష్టం జరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పోలీసులు ఎంత నిఘా పెట్టినా సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ నగరంలో బెట్టింగ్ భూతం పట్టి పీడిస్తోంది. ఐపీఎల్ సీజన్లో బెట్టింగ్‌ల జోరుతో పందెం రాయుళ్లకు పండుగ వాతావరణం నెలకొంది.

శివార్లకు పాకిన పందెం..

చాపకింద నీరులా క్రికెట్ బెట్టింగ్ నగరంలోని ప్రతి మూలతో పాటు శివారు ప్రాంతాలకు సైతం వ్యాపించింది. కొందరు తమ సెల్ఫోన్లో బెట్టింగ్లకు సంబంధించిన యాప్‌లను డౌన్లోడ్ చేసుకుని ఆన్‌లైన్ పేమెంట్ విధానంతో పందెం కాస్తున్నారు. మరికొందరు ఆఫ్‌లైన్ విధానంలోనూ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఆఫ్‌లైన్‌కు సంబంధించి ఓ వ్యక్తి మధ్యవర్తిగా ఉండి తతంగం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో యువత ఓ దగ్గర కూర్చొని బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, ప్లేయర్ల స్కోర్, వికెట్లపై బెట్టింగ్ కడుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా కోడ్ భాషతో మాట్లాడుకుంటూ పందెం కాస్తున్నారు. ప్రతిఒక్కరి వద్ద సెల్‌ఫోన్ ఉండటంతో ఎప్పటికప్పుడు పందెం రాయుళ్లకు సమాచారం అందించి లావాదేవీలు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే యువత ఆసక్తి, సరదా పందెం రాయుళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది.

విదేశాల్లోనూ సంబంధాలు..

దేశానికి చెందిన కొంత మంది యువకులు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అక్కడి వారితో మన దేశంలో ఉన్న యువతకు పరిచయాలు ఉండటంతో వారితోనూ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు.

– ఇటీవల సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి కుమారుడు (బీటెక్ విద్యార్థి) క్రికెట్ బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేక ఆత్మహత్యకు యత్నించాడు. చివరకు తల్లిదండ్రులకు విషయం తెలియడంతో కొన్ని డబ్బులు మధ్యవర్తికి సరిచేసి అప్పుల నుంచి కాపాడుకున్నారు.

– శివారు ప్రాంతానికి చెందిన మరో యువకుడు అప్పులు చేసి క్రికెట్ బెట్టింగ్ పెట్టాడు. అతడు మొదట్లో మధ్యవర్తిగా ఉండి కొంత వ్యవహారం నడిపినా.. చివరకు ఢీలా పడ్డాడు. అనుకున్న మ్యాచ్‌లు గెలవక పోవడంతో ఇచ్చే వారికి డబ్బులు ఇవ్వలేక ముఖం చాటేసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు.

ఇలా అనేక ఘటనలు జరిగినా బయటకు పొక్కడం లేదు. బెట్టింగ్ కారణంగా ఎంతో మంది అప్పుల ఊబిలో చిక్కుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

అప్పుల ఊబిలో యువత..

యువతకు బెట్టింగ్ ఓ వ్యసనంలా మారింది. కొందరు ఎలాంటి పనులు చేయకుండా బెట్టింగ్ పైనే ఆధారపడుతున్నారు. అయితే శివారు ప్రాంతాల్లోని గ్రామాల్లోనూ బెట్టింగ్లతో డబ్బులు నష్టపోయిన వారు చాలా మంది ఉన్నారు. చివరకు అప్పులపాలై ఆత్మహత్యకు యత్నిస్తున్నారు. మరికొందరు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడుతున్నారు. బెట్టింగ్ ను అరికట్టకపోతే పెను ముప్పు వాటిల్లే అవకాశం లేకపోలేదు. సరదా కోసం బెట్టింగ్ కాసిన ఎంతో మంది వ్యసనంలా మార్చుకుంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ కావడంతో పిల్లలపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేసులు నమోదు చేస్తాం...

బెట్టింగ్ ఆడుతున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం. అనుమానం ఉన్న వ్యక్తులపై, స్టేషన్ పరిధిలో నిఘా పెంచుతాం. ఇప్పటి వరకు బెట్టింగ్‌ల విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి.

– వి.రామకృష్ణ, ఎస్‌హెచ్‌ఓ, కార్ఖానా

యాదవుల హక్కుల సాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన యాదవ సంఘం ప్రతినిధులు

బేగంపేట్, ఏప్రిల్ 17: యాదవుల అభివృద్ధి, హక్కుల సాధన కోసం కృషి చేయాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గెలుబోయిన కుమార్‌యాదవ్, పలువురు యాదవ సంఘం నేతలు గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుమార్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన వారిలో యాదవ సంఘం నాయకులు రాములు యాదవ్, సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బాలేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, కిషోర్ యాదవ్, రఘు యాదవ్, మధు యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, అరుణ్‌గౌడ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

కల్యాణ వేడుకలకు ఆహ్వానం

సికింద్రాబాద్, ఏప్రిల్17: సీతాఫల్‌మండి డివిజన్ మధురా నగర్ కాలనీలోని బంగారు మైసమ్మ దేవాలయం 9వ వార్షికోత్సవానికి రావాలని మాజీ మంత్రి తలసానికి ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ఆహ్వానం అందజేశారు. ఈ నెల 23న నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొనాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు శగాబండి ప్రకాష్, శ్రీకాంత్‌రెడ్డి, టాటా స్కై శ్రీనివాస్ శైలందర్ పాల్గొన్నారు.

తులాకాంత దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

పూజల అనంతరం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

బొల్లారం, ఏప్రిల్ 17: ఒకటో వార్డు న్యూబోయిన్పల్లి పెన్షన్‌లైన్ బస్తీలో గురువారం తులాకాంతమ్మ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జగదీష్, హనుమంతరావు, ఆత్మారం, శ్రీకాంత్, సర్వణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌గా నిలిచేలా సెట్విన్

సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రంలోని విద్యార్థులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 17: సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఓ మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, మరో రెండు అంతస్తుల్లో భవన సముదాయాన్ని నిర్మించి కొత్త ట్రేడ్‌లలో శిక్షణ కల్పిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. గురువారం ఆయన సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో ముచ్చటించారు. బ్యుటీషియన్, కంప్యూటర్, ఫాషన్ డిజైనింగ్, హోటల్ మానేజ్‌మెంట్, మొబైల్ రిపేరింగ్, సీసీ కెమెరా రిపేరింగ్ విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐదేండ్ల క్రితం సీతాఫల్ మండిలో నెలకొల్పిన సెట్విన్ శిక్షణ కేంద్రం తన ప్రత్యేకతను చాటుకుంటుందని తెలిపారు. త్వరలో దీని కార్యకలాపాలు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ఇన్‌చార్జి అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారు



అమీర్‌పేట్ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి

అమీర్‌పేట్, ఏప్రిల్ 17: తెలంగాణ సీఎంగా కేసీఆర్ ఉంటేనే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి అన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల ఆదరణ చెక్కచెదరలేదన్నారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు అమీర్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.హనుమంతరావు, మణికుమార్ నేతృత్వంలో డివిజన్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. శేషుకుమారి మాట్లాడుతూ దశాబ్దంగా సాఫీగా సాగిన పాలనతో బంగారు దిశగా అడుగులు వేసిన తెలంగాణ, ఇప్పుడు ఆరాచక పాలనలో తిరోగమన దిశకు మళ్లిందన్నారు. ఎమ్మెల్యే తలసాని నేతృత్వంలో పార్టీ శ్రేణులు సభను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, దాడి ప్రవీణ్‌రెడ్డి, హరిసింగ్‌జాదవ్, ఉత్తమ్‌కుమార్‌తో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆదరణ తగ్గని నాటక రంగం

కళాకారులను సత్కరించిన రేలంగి నరసింహారావు

ముషీరాబాద్, ఏప్రిల్ 17: నాటక రంగం మరుగవకుండా విశేష ఆదరణ కలిగి ఉందని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్‌థియేటర్స్, రేలంగి ఆర్ట్స్‌అకాడమీ నిర్వహణలో మహతి క్రియేషన్స్ (హైద్రాబాద్)వారిచే గోవిందరాజుల నాగేశ్వరరావు రచించిన ఈ మంచం నాదికాదు హాస్య నాటిక ప్రదర్శన జరిగింది. బందా రాజగోపాల్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేలంగి మాట్లాడుతూ నాటికలో అంతర్గతంగా సమాజానికి సందేశం అందించారన్నారు. ప్రముఖ నటుడు సుబ్బరాయ శర్మ, వంశీ రామరాజు, బూరుగుపల్లి వ్యాస కృష్ణ, నిర్మాత తుమ్మల పల్లి రామ సత్యనారాయణ,అర్ నారాయణ రావు, సుంకరపల్లి శైలజ, సుధామయి తదితరులు పాల్గొన్నారు.

12కిలోల ఎండు గంజాయి స్వాధీనం

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 17: బెర్హంపూర్ నుంచి మహారాష్ట్రలోని దాదర్‌కు రైల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. 6 లక్షల 15 వేలు విలువ చేసే 12.318కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గురువారం రైల్వే పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను రైల్వే డీఎస్పీ జావెద్, సీఐ సాయిఈశ్వర్‌గౌడ్ వెల్లడించారు. ఒడిశాకు చెందిన మున్నానాయక్ (29), అదే ప్రాంతానికి చెందిన సమీరా బిషోయి (31) స్నేహితులు. గంజాయి సరఫరా వ్యాపారం గురించి సమీర్ బిషోయితో నాయక్ చెప్పాడు. ఇరువురు ఈ నెల 16న మహారాష్ట్రలోని దాదర్‌కు 12 గంజాయి ప్యాకెట్లు తీసుకెళ్లేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరి 17న సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. దేవగిరి రైల్లో మహారాష్ట్రకు వెళ్లాల్సి ఉంది. రైల్వే స్టేషన్లో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులను చూసిన నిందితులిద్దరు బ్యాగ్‌లను వదిలి పారిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 7వ నంబర్ ప్లాట్ ఫారంలోకి దేవగిరి రైలు రావడంతో తిరిగి వచ్చి బ్యాగ్‌లను రైల్లో వేసే ప్రయత్నం చేశారు. అప్పటికే మాటు వేసి ఉన్న రైల్వే పోలీసులు సమీర్ బిషోయిని పట్టుకున్నారు. మరో నిందితుడు పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రైల్వే పోలీస్ సిబ్బందిని డీఎస్పీ, సీఐ అభినందించారు.

ఓయూ నుంచి లాలాపేట్‌కు రాకపోకలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): గతంలో మూసేసిన తార్నాక జంక్షన్ ను నేటి నుంచి మే 2 వరకు 15రోజుల పాటు రాకపోకల కోసం తిరిగి ప్రారంభిస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డెవిస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ వైపు నుంచి లాలాపేట్ వైపు, తిరిగి లాలాపేట్ నుంచి ఓయూ వైపు వాహనాలు ప్రయాణించడానికి అనుమతిస్తారన్నారు.

ఈ మార్గాల్లో వెళ్లొచ్చు..

ఓయూ నుంచి వచ్చే వాహనాలు లాలాపేట్ వైపుకు నేరుగా వెళ్లవచ్చు. హబ్సిగూడ వైపు కుడివైపు మలుపు తీసుకోవచ్చు. లాలాపేట్ నుంచి వచ్చేవి ఓయూ వైపుకు నేరుగా వెళ్లవచ్చు. మెట్టుగూడ వైపు కుడివైపు మలుపు తీసుకోవచ్చు.

ట్రాఫిక్ అనుమతించనిది..

మెట్టుగూడ నుంచి వచ్చే వాహనాలు ఓయూ వైపునకు కుడివైపు మలుపు తీసుకోవడానికి అనుమతి లేదన్నారు. బదులుగా, వాహనాలు నేరుగా హుడా కాంప్లెక్స్, తార్నాక వైపు వెళ్లి అక్కడ యూటర్న్ తీసుకొని తార్నాక వద్ద ఎడమవైపు మలుపు తీసుకొని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లాలి. హబ్సిగూడ నుంచి వచ్చే వాహనాలు లాలాపేట్ వైపు కుడివైపు మలుపు తీసుకోవడానికి అనుమతించరు. వాటి బదులు, నేరుగా ఇక్రిశాట్ వైపుగా వెళ్లి అక్కడ యూటర్న్ తీసుకొని తార్నాక జంక్షన్ వద్ద ఎడమవైపు మలుపు తీసుకొని లాలాపేట్ వైపు వెళ్లాలి.

టీజీజీడీఏ జనరల్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక

డాక్టర్ల అసోసియేషన్ నూతన సభ్యులు

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 17: తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ (టీజీజీడీఏ) సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి యూనిట్‌లో ఇటీవల ఖాళీ అయిన రెండు జనరల్ కౌన్సిల్ మెంబర్ పోస్టులకు గురువారం ఎన్నికలు జరిగాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగ్గా, సాయంత్రం ఐదు గంటలకు ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఇందులో విజేతలుగా ప్రొఫెసర్ కేడర్‌లో డాక్టర్ సుబోద్ కుమార్, అసోసియేట్/ అసిస్టెంట్ కేడర్‌లో డాక్టర్ రాజేశ్ కుమార్ నిలిచారని రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన డా.ఆవుల మురళీధర్ తెలిపారు. టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు ప్రొ.భూపేందర్ సింగ్ రాథోడ్, కార్యదర్శి డా.అబ్బయ్య, కోశాధికారి డా.రవి విజేతలను అభినందించారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

గాంధీనగర్‌లో వాల్ పెయింటింగ్ చేస్తున్న ముఠా జైసింహ

చిక్కడపల్లి, ఏప్రిల్ 17: ఈ నెల 27వ తేదీన వరంగల్లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ పిలుపునిచ్చారు. గురువారం గాంధీ నగర్‌లో సిల్వర్ జూబ్లీ సభను జయప్రదం చేయాలని చలో వరంగల్ వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని జయసింహ పెయింటింగ్ వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ప్రతిబస్తీ, నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో సభకు తరలి రావాలని అన్నారు. పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు సభకు తరలివెళ్లి జయప్రదం చేద్దామని అన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్ కుమార్, శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యనారాయణ, రవిశంకర్‌గుప్తా, శ్రీకాంత్, బత్తుల కిరణ్, వంశీ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

కవాడిగూడ: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. వరంగల్ రజతోత్సవ సభకు ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరుతూ కవాడిగూడ డివిజనలోని కట్టమైసమ్మ ఆలయం వద్ద వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం జయసింహ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వాన్నే తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని, రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ నాయకుడు గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నాయకులు ఎన్.డి.సాయికృష్ణ, చిత్రాలనగర్ శ్రీహరి, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 17: రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం-గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మధ్యన గుర్తు తెలియని వృద్ధుడు రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల అక్కడే పడి ఉన్నాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ సిబ్బందికి, రైల్వే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని గాయ పడిన బుద్ధుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు వైద్య పరీక్షలు చేసి పరీక్షించగా మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి జేబులో గుండ్ల పోచంపల్లి నుంచి సికింద్రాబాద్ కు తీసుకున్న రైలు టికెట్ ను పోలీసులు సాధించేసుకున్నారు. మృతుని వయసు సుమారు 65-70 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేసిన ఎన్టీపీసీ

విద్యార్థులకు స్కూలు బ్యాగులను అందజేసిన ఎన్టీపీసీ అధికారులు

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 17 : భోలక్ పూర్ లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సదరన్ రీజియన్ హెడ్‌క్వార్టర్స్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ భాగంగా 675 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లను అందజేశారు. ముఖ్య అతిథిగా సంస్థ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రహి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అఖిల్ పట్నాయక్, మేనేజర్ బి.ప్రియాంక హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.స్వరూప, మాజీ ప్రధానోపాధ్యాయులు కె. మల్లికార్జున రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు శేషగిరిరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం

వారసత్వ ర్యాలీ ప్రదర్శనలో పాల్గొన్న డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మణికొండ, మధు వొట్టేరి

బొల్లారం, ఏప్రిల్ 17: రాష్ట్రపతి నిలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ, మధు వొట్టేరి కల్పన హాజరయ్యారు. దేశం సాంస్కృతిక వారసత్వంతో పాటు సాంస్కృతిక విలువలపై ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వం సమిష్టి ప్రయోజనాలను ప్రోత్సహించాలన్నారు. తరతరాలుగా సాంస్కృతిక నిశ్చితార్థాన్ని ప్రోత్సహించే శక్తివంతమైన సాంస్కృతిక కేంద్రాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 17: రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించతలపెట్టిన చలో సెక్రటేరియట్ ముట్టడి చేశారు. ఓయూ ఆర్ట్స్‌కళాశాల నుంచి బయలుదేరబోయిన పార్ట్ టైం అధ్యాపకులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసిన వారిని చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసుస్టేషన్లకు తరలించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క బృందం ఆందోళనకు మద్దతు ప్రకటించి సంఘీభావం ప్రకటించింది. విమలక్క మాట్లాడుతూ వర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి సర్వీసు క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నియామకాల్లో పార్ట్ టైం టీచర్లకు వెయిటేజ్ ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు అధ్యాపకులు మాట్లాడారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి పోతుల రమేశ్ తద